సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 24 । మార్చి । 2023



పసుపు రైతు పరేషాన్!

పంట చేతికి వస్తున్న దశలో పసుపు రైతులకు కష్టాలు తప్పడం లేదు. మార్కెట్‌లో ధర లేక దిగాలు చెందుతున్నారు. 10లో▸

కనిపించిన నెలవంక



తాండూరు: ముస్లింలకు అత్యంత పవిత్రమాసమైన రంజాన్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. గురువారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించగానే ముస్లింలు ప్రార్థన మందిరాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు చాంద్ ముబారక్ చెబుతూ శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే నెల 22వ తేదీ వరకు ఉపవాస దీక్షలు చేపడతారు.



న్యూస్‌రీల్

అవార్డులకు 13 గ్రామాలు ఎంపిక

కొడంగల్: జాతీయ పంచాయతీ అవార్డుల కోసం మండలంలోని 13 గ్రామ పంచాయతీలను ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ పాండు తెలిపారు. మండల స్థాయిలో అవార్డులు చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. సంగాయిపల్లి, లక్ష్మీపల్లి, ఉడిమేశ్వరం, అంగడిరాయిచూర్, రుద్రారం, టేకోల్‌కోడ్, పెద్దనందిగామ, రావులపల్లి, అప్పాయిపల్లి, హస్నాబాద్, పర్సాపూర్, ఇందనూర్, కస్తూరుపల్లిలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్ ఇచ్చి శాలువాతో సన్మానం చేస్తామన్నారు.

పాంబండ హుండీ ఆదాయం రూ. 4,63,171



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు ముగియడంతో గురువారం ఆలయ పాలకవర్గం హుండీ లెక్కింపు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రాములు, ఈఓ సుధాకర్‌లు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా హుండీ లెక్కించగా 4,63,171 రూపాయల ఆదాయం వచ్చిందని వారు తెలిపారు. కార్యక్రమంలో హుండీ లెక్కింపు పర్యవేక్షకులు శ్రీనివాస్, కుల్కచర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఆలయ అర్చకులు, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదిల్‌కు ఎంపీ అభినందనలు



ఆదిల్‌ను సన్మానించిన ఎంపీ రంజిత్‌రెడ్డి

పూడూరు: జాతీయ సేవా రత్న అవార్డు గ్రహీత మన్నెగూడ ఆదిల్ గ్రూప్ చైర్మన్ సయ్యద్ ఆదిల్‌హైమద్‌ను గురువారం చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుండాలని అన్నారు. యువత తలచుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదన్నారు. యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ కోఅప్షన్ సభ్యుడు షకీల్, కౌన్సిలర్ మహమ్మద్ షరీఫ్, నాయకులు అయూబ్, షోయబ్,సిద్దిక్, అబిద్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ



హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ, పోలీసులు

తాండూరు టౌన్: హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపడం ప్రాణానికి రక్షణ కవచంగా నిలుస్తుందని డీఎస్పీ శేఖర్ గౌడ్ అన్నారు. గురువారం ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ప్రధాన రహదారి మార్గం, పాతతాండూరు, ఇందిరానగర్, సాయిపూర్ ప్రాంతాల్లో సుమారు 50 మంది పోలీసులు హెల్మెట్‌లు ధరించి ద్విచక్రవాహనాలపై ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విధిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఓయూలో హైటెన్షన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. పేపర్ లీకేజీ వ్యవహారంపై ఐక్య విద్యార్థి సంఘాలు శుక్రవారం మహా నిరసన దీక్ష, ప్రగతిభవన్‌కు నిరుద్యోగ మార్చ్ చేపట్టనున్నాయి. వీటికి తోడు వర్సిటీలో ఓయూ ఆధ్వర్యంలో పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు జరగనున్నాయి. నిరుద్యోగుల మహానిరసన దీక్షకు అనుమతి లేదని అధికారులు పేర్కొంటున్నారు. రేవంత్ రెడ్డి దీక్షకు హాజరైతే అడ్డుకుంటామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు చెబుతుండటం గమనార్హం.

జనం అక్షరం సాక్షిగా..

సంచలనాలకు మారుపేరు 'సాక్షి'.. అనేక కథనాలు ప్రచురించి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపింది. అలుపెరగని అక్షర యజ్ఞంతో సమాజంలో మార్పులు చోటుచేసుకునేలా కృషి చేస్తోంది. జిల్లాలో సంస్కృతి, సంప్రదాయాలు, రాజకీయ కథనాలు, కబ్జాలు, నేరాలు ఘోరాలు, మానవీయ కోణం.. ఇలా ఆయా అంశాల్లో ప్రచురితమైన కథనాలతో బాధితులకు బాసటగా నిలుస్తోంది. అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి వారిపై కొరడా ఝళిపించేలా చేస్తోంది. మరోవైపు సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు బాటలు వేసింది. ఇలా అందరి మన్ననలు పొందుతూ 16వ వసంతంలోకి అడుగిడుతున్న వేళ మచ్చుకు కొన్ని ఘటనలు ఇవి..

– వికారాబాద్

సాక్షి CELEBRATING 15 YEARS



బాల్యం అడవి పాలు

బడిబాటన..

వికారాబాద్ అర్బన్: బాల్యం అడవి పాలు అనే శీర్షికన గత నెల 13న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, విద్యాధికారి రేణుకాదేవి వెంటనే స్పందించారు. విద్యాశాఖ అధికారులు చెంచు కాలనీకి వెళ్లి విద్యార్థులపై ఆరా తీశారు. రెండేళ్లుగా పాఠశాలకు దూరమైన ఐదుగురు చిన్నారులను బడిబాట పట్టించారు. సాక్షి కథనంతో చిన్నారులు తిరిగి బడికి వెళ్లారు.

పరుచుకున్న పచ్చందాలు



పచ్చదనానికి మచ్చ!



కొత్త మొక్కలు నాటిన సిబ్బంది

'పచ్చదానికి మచ్చ' అనే శీర్షికతో ఈనెల 5న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. పరిగి పట్టణంలోని హైదారాబాద్ వెళ్లే దారిలో మొక్కలు మొత్తం ఎండిపోయాయి. హరితహారంలో భాగంగా పార్కుల్లో నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోవడం.. వాటిని పట్టించుకునే నాథుడే కరువైన వైనంపై కథనం వెలువడింది. దీంతో అధికారులు స్పందించి ఎండిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటారు. రోజూ నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం అక్కడ మొక్కలు నాటడంతో పార్కు పచ్చదనాన్ని సంతరించుకుంటోంది.

అనాథలు, నిరుపేదలకు చేయూత..



అనాథలం.. ఆదుకోండి

తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందడంతో అనాథలైన ఇబ్రహీంపట్నం మండలం పొల్కంపల్లికి చెందిన కంబాలపల్లి శిరీష, మౌనికలకు 'సాక్షి' అండగా నిలిచింది. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి స్పందించి ఆ బాలికలకు దళితబంధు ప్రకటించారు. బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశ్ రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఎంతో మంది దాతలు స్పందించి నిత్యావసర సామగ్రితోపాటు ఆర్థిక సాయం అందజేశారు.



బాసటగా నిలిచిన ఎమ్మెల్యే

'చదువుపై మమకారం.. గుడిసే ఆధారం' శీర్షికతో ఓ పేదింటి దీన గాథపై గత నవంబర్ నెలలో 'సాక్షి'లో కథనం ప్రచురితమయ్యింది. 13 ఏళ్లుగా పూరిగుడిసెలో ఉంటూనే తమ పిల్లలను కష్టపడి చదివిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి స్పందించారు. బోంరాస్‌పేట మండలం మాలెకాడిబావిపల్లెకు ఆయన నేరుగా వెళ్లి గుడిసెలో ఉంటున్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఆదుకుంటామని భరోసా కల్పించారు. అంతేకాకుండా ఉండేందుకు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలో ఇల్లు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఆ పేద కుటుంబం 'సాక్షి'కి అభినందనలు తెలిపింది.



చదువుపై మమకారం గుడిసే ఆధారం



మరమ్మతులు చేపట్టిన తరువాత ఇలా..

కదిలిన యంత్రాంగం



కంకర పోశారు.. బీటీ మరిచారు

గత సంవత్సరం డిసెంబర్ 28న కంకర పోశారు.. బీటీ మరిచారు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పరిగిలో నూతనతంగా నిర్మించిన బీటీ రోడ్డు నాణ్యత లోపించడంతో గుంతలమయంగా మారింది. రోడ్డుపై కంకర వేసి వదిలేశారు. నెలల తరబడి అలానే ఉండటంతో వాహనదారులు కంకర రోడ్డుపై వెళ్తుంటే దుమ్ముతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో రోడ్డును బాగు చేయించారు. స్థానికులు 'సాక్షి'కి అభినందనలు తెలిపారు.

పెండింగ్ రుణాలు వెంటనే ఇవ్వండి

- వచ్చే నెల 20లోగా పూర్తిచేయాలి
- బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్ నారాయణరెడ్డి
- సబ్సిడీ నిధులు విడుదలైనా గ్రౌండ్ చేయకపోవడంపై ఆగ్రహం



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లబ్ధిదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రుణాలను ఏప్రిల్ 20లోగా మంజూరు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకర్లు, అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ రుణాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఇన్ని రోజులుగా మంజూరు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ నిధులు విడుదల అయినప్పటికీ ఇప్పటివరకు గ్రౌండ్ చేయకపోవడంపై ఎస్‌బీఐ బ్యాంకు అధికారులపై మండిపడ్డారు. చన్గోముల, కంకల్, బొంరాస్‌పేట, వికారాబాద్ బ్రాంచీలలో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పంట రుణాల కింద డిసెంబర్ నాటికి రూ.2433.53కోట్ల లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.1,192.54 కోట్ల రుణాలు అందజేసి 49శాతం లక్ష్యం సాధించామని, ఈ లక్ష్యాన్ని మార్చినెలాఖరులోగా 80శాతం లక్ష్యం పూర్తి చేయాలని బ్యాంకులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అన్ని రంగాలకు కలిపి మొత్తం రూ.6,693.90 కోట్లు రుణాల లక్ష్యం కాగా ఇప్పటివరకు 36 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. రైతులకు పంట రుణాలు విరివిగా అందించేందుకు బ్యాంకర్లు సంబంధిత అధికారులందరూ టీం వర్క్‌గా పనిచేసి ఈ యాసంగిలో 80శాతం రుణాలు అందించే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే స్టార్టప్ ఇండియా పథకం కింద ఎల్‌డీఎం, జీఎం ఇండస్ట్రీస్, గిరిజన సంక్షేమ శాఖ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అధికారులు కలిసి జిల్లాలో ఈ నెలాఖరులోగా కనీసం వంద దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఏప్రిల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమీక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార సంస్థల ఆధునీకరణ పథకం కింద ఇప్పటివరకు జిల్లాలో 58 యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. ఇందులో 17 యూనిట్లు ఇప్పటికే గ్రౌండ్ చేసినట్లు తెలిపారు. మరో 120 యూనిట్లు బ్యాంకర్ల వద్ద ప్రాసెస్‌లో ఉన్నాయని, వాటిని రోజుల్లో గ్రౌండ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డీఎం రాంబాబు, ఆర్‌బీఐ ఏజీఎం హనుమాకుమారి, నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్ ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలు పూర్తిచేయండి

- అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ
- మున్సిపల్ అధికారులతో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: ఆస్తి పన్ను వసూళ్లు వారం రోజుల్లో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఇతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పేరుకుపోయిన ఆస్తి పన్ను వసూలులో నిర్లక్ష్యం తగదన్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వంద శాతం పన్ను వసూళ్లు చేయాలని సూచించారు. అలాగే నర్సరీలు, పట్టణ ప్రగతి వనాలను నిర్వహణలో అలసత్వం వహించకూడదని ఆయన సూచించారు. ఇప్పటికే జిల్లాలో మంజూరైన సమీకృత మార్కెట్ సముదాయాలు, వైకుంఠధామాల పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పట్టణ ప్రగతి కింద చేపట్టిన పనులను మున్సిపల్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వారం రోజుల్లో జిల్లాలో పర్యటించి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పరిగి మున్సిపల్ కేంద్రంలోని జాతీయ రహదారిలో వీధి దీపాలు లేనందునా ప్రజలు ఎంతో ఇబ్బందికి గురవుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ సాయంత్రం లోగా వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపల్ కమిషనర్లు శరత్ చంద్ర, జి. శ్రీనివాసన్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ మేళా

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాలనే లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ మేళా నిర్వహిస్తున్నారు. అందుకు ఒక అధికారిని కూడా కేటాయించారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఆయన పన్ను చెల్లింపుపై తగు సూచనలు, సలహాలు ఇస్తూ పన్ను చెల్లించాలని కోరుతున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ మేళాలో సంప్రదించాలని అధికారులు చెబుతున్నారు.

మోహినీ అవతారంలో శ్రీవారు

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే
- శేష వస్త్రం తీసుకొచ్చిన తిరుమల అర్చకులు



మోహినీ అవతారంలో స్వామివారు

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రోకంగా తిరుమల తరహాలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం శ్రీవారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి దేవేరుల సమేత మలయప్ప స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వరాహస్వామి సన్నిధి నుంచి పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చక మిరాశీదారు పెద్దింటి వెంకటరమణ దీక్షితులు, రవిచంద్ర దీక్షితులు స్వామివారికి శేష వస్త్రం సమర్పించారు.

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం

బాలాజీనగర్‌లో వెలిసిన కలియుగ వైకుంఠ దైవం.. కొడంగల్ ప్రాంత ప్రజల ఇలవేల్పు వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం గరుడ వాహనంపై శ్రీవారి ఊరేగించారు. గురువారం రాత్రి 10 గంటలకు భూదేవి శ్రీదేవి సమేతంగా శ్రీవారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా లంకాదహనం

గురువారం అర్ధరాత్రి జాతర స్థలంలో లంకాదహన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆద్యాంతం భక్తుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

విజృంభిస్తున్న మహమ్మారి

- పెరుగుతున్న క్షయ రోగుల సంఖ్య
- గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి అధికం
- నేడు ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం



తాండూరు పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర రవీంద్ర యాదవ్, సిబ్బంది

వికారాబాద్ అర్బన్: నివురుగప్పిన నిప్పులా క్షయ వ్యాధి విస్తరిస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారుల అంచనా ప్రకారం గ్రామీణ స్థాయిలో ఇటీవల ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా బయట పడుతున్నట్లు చెబుతున్నారు. టీబీ రోగానికి సంబంధించి అన్నీ ప్రభుత్వ ఏరియా, పీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంటున్నాయని, సరైన క్రమంలో మందులు వాడితే వ్యాధి నుంచి బయట పడవచ్చని అంటున్నారు. క్షయ వ్యాధి (టీబీ)నిర్మూలనకు ప్రభుత్వం ఇటీవల పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ప్రస్తుతం అమల్లో ఉన్న పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి చర్యలు తీసుకుంటోంది.

జిల్లాలో 2,215 మంది..

జిల్లాలో టీబీ రోగుల సంఖ్య ఇటీవల పెరుగుతున్నట్లు వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. 2021లో 1,178 మంది టీబీ రోగులు ఉన్నారు. ప్రస్తుతం 19 మండలాల్లో 2,215 కేసులు ఉన్నాయన్నారు. 2019లో ఈ సంఖ్య కేవలం 273 ఉండేది. టీబీ లక్షణాలు ఉన్నా చాలా మంది ప్రజలు వైద్యం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది చొరవతో రోగుల సంఖ్య బయటపడుతున్నట్లు చెబుతున్నారు.

కొడంగల్‌లో అధికం..

టీబీ నివారణ విభాగం జిల్లాను 5 డివిజన్లుగా విభజించి వైద్య సేవలు అందిస్తున్నారు. వీరి లెక్క ప్రకారం మూడు సంవత్సరాల క్రితం వరకు పరిగి, తాండూరు డివిజన్లలో ఎక్కువ టీబీ రోగులు ఉన్నారు. గత ఏడాది నుంచి కొడంగల్ డివిజన్‌లో అధికంగా ఉన్నట్లు తేల్చారు. కొడంగల్‌లో 2017లో కేవలం 32 మంది టీబీ రోగులు ఉండగా 2018లో ఆ సంఖ్య 229మందికి చేరింది. 2019లో 236కు పెరిగింది. 2020లో 302కు, 2021లో 356కు చేరింది. 2022–23లో 559 కేసులు ఉన్నాయి.

అందరి సహకారం అవసరం

తాండూరు టౌన్: టీబీ రహిత (క్షయ వ్యాధి) సమాజ స్థాపన అందరి సహకారంతో సాధ్యమని జిల్లా క్షయ వ్యాధి నియంత్రణాధికారి డాక్టర రవీంద్ర యాదవ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, వ్యాధిపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి ప్రాణాంతకమేమీ కాదని, సరైన సమయంలో దానిని గుర్తించి మందులు వాడితే తగ్గుతుందన్నారు. ఎడతెరిపి లేని దగ్గు, ఎక్కువ కాలం దగ్గు తగ్గక పోవడం తదితర లక్షణాలతో క్షయ వ్యాధిని గుర్తించవచ్చన్నారు. ప్రజలందరూ ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, దీనిలో భాగంగా క్షయ వ్యాధికి గురైన వారికి ఉచితంగా ఆరు నెలల పాటు మందులు పంపిణీ చేస్తోందన్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థల సహకారంతో పౌష్టికాహార కిట్లను కూడా అందజేయనున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

హుండీలో నగదు చోరీ

శంకర్‌పల్లి: పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణ గల రేణుక ఎల్లమ్మ ఆలయంలో హుండీ తాళం పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మార్కెట్‌లోని కూరగాయల కమీషన్ ఏజెంట్ శేఖర్‌రెడ్డి గురువారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బీ శశిధర్‌రెడ్డి ఆలయాన్ని పరిశీలించారు. బుధవారం పండుగ ఉండడంతో సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మార్కెట్ కమిటీ ఆవరణలోని సీసీ ఫుటేజీని సేకరించారు. గతంలో మార్కెట్‌లో దొంగతనం జరిగింది, ఉల్లి గడ్డల సంచులు ఎత్తుకెళ్లారని కూరగాయల ఏజెంట్లు తెలిపారు. ఇటీవల మహిళ మెడలోంచి పుస్తెల తాడును లాక్కెల్లారని వివరించారు. మార్కెట్ కమిటీ పరిసరాల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలని కోరారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

ఆమనగల్లు: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు పెద్దయ్యగౌడ్ మృతిచెందిన సంఘటన మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గురువారం మృతుని కుటుంబాన్ని రాష్ట్ర గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు వెంకన్నగౌడ్ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు యాదయ్యగౌడ్, రాజుగౌడ్, వెంకటయ్యగౌడ్, సత్తయ్య పాల్గొన్నారు. మృతుని కుటుంబానికి ఐక్యత ఫౌండేషన్ సభ్యులు జైపాల్‌రెడ్డి, శివగౌడ్, శివ, జంగయ్య, శివరాజ్‌గౌడ్ పరామర్శించి రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు.

ఎమ్మెల్యేపై అసభ్య పోస్టులు

వ్యక్తి రిమాండ్

కేశంపేట: ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో పాటు కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ నిందితుడి వివరాలు వెల్లడించారు. మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేటకు చెందిన ఏ మదన్‌మోహన్ ఉగాది పండుగ రోజు సోషల్ మీడియాలో ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబసభ్యులపై అసభ్య పోస్టు పెట్టాడు. దీనిపై కొత్తపేటకు చెందిన జమాల్‌ఖాన్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై గతంలో కొత్తూర్, కేశంపేట పీఎస్‌లలో రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు. మదనమోహన్‌పై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ధనుంజయ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

శంకర్‌పల్లి: పట్టణంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడులు చేశారు. హనుమాన్ నగర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు వెళ్లారు. పేకాట రాయుళ్లు తప్పించుకొని పారిపోయారు. పోలీసులు నాలుగు బైక్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంపులో పడి బాలుడి మృతి


వినయ్ మృతదేహం

చేవెళ్ల: ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు ఇంటి ఆవరణలోని నీటి సంపులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చేవెళ్లకు చెందిన వీ రాజుచారికి ఇద్దరు కొడుకులు. చిన్నకొడుకు వినయ్(4) ఉదయం ఇంటి ముందు తోటి పిల్లలతో ఆడుకుంటూ సంపులో పడిపోయాడు. దీన్ని ఎవరూ గమనించలేదు. బాలుడు చాలా సేపు వరకు ఇంట్లోకి రాకపోవడంతో తల్లిదండ్రులు బయటకు వచ్చి చూశారు. ఎక్కడా కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. అయినా బాలుడి ఆచూకీ లభించలేదు. దీంతో సంపులో చూశారు. అందులో బాలుడు విగతజీవిగా కనిపించాడు. అప్పటివరకు కళ్ల ముందు ఆడుకుంటూ కనిపించిన పిల్లవాడు లేడనే విషయాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. బోరున విలపించారు.

పసుపు రైతు పరేషాన్!

- మూడేళ్లుగా అందని గిట్టుబాటు ధర
- కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు

భారీ పెట్టుబడితో సాగు చేసిన పసుపు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్లుగా కురుస్తున్న వర్షాలకు పంటకు తెగుళ్లు సోకి దిగుబడి తగ్గినా ప్రభుత్వం ఆదుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.


ఉడుకబెట్టేందుకు సిద్ధంగా ఉన్న పచ్చి పసుపు

పెద్దేముల్: కుటుంబమంతా ఏడాది పాటు శ్రమించి పంట చేతికి వస్తున్న దశలో పసుపు రైతులకు కష్టాలు తప్పడం లేదు. కాసుల వర్షం కురుపిస్తుందని నమ్మి పంటను సాగుచేస్తే.. వ్యాపారుల మాయజాలం అన్నదాతల అంచనాలను మూడేళ్లుగా తలకిందలు చేస్తోంది. పండించిన పంటను ఆరు నెలల పాటు నిల్వలు చేసినా గిట్టుబాటు ధర దక్కటం లేదు. పసుపు పంటతో అప్పులు తీరుతాయని ఆశపడిన రైతును ధర పాతాలానికి తొక్కేస్తుంది.

400 ఎకరాలకు పైగా సాగు

మండల పరిధిలోని నాగులపల్లి, రుద్రారం, గోపాల్‌పూర్, ఇందూరు, ఆత్కూర్, తింసాన్‌పల్లి, నర్సపూర్, గిర్మాపూర్లతో పాటు పలు గ్రామాల్లో రైతులు పసుపు పంటను సాగుచేస్తున్నారు. కోట్‌పల్లి మండలం అన్నసాగర్, పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామం పసుపు సాగుకు ప్రసిద్ధి. రెండు మండలాలల్లో కలిపి సుమారు 400ఎకరాలకు పైగా పసుపు పంటను సాగుచేస్తున్నారు. నాగులపల్లి గ్రామంలో నీరు పుష్కలంగా ఉండడంతో ప్రతీ రైతు ఎంతో కొంత పసుపు పంట తప్పక సాగుచేస్తున్నారు. వర్షాకాలం మొదట్లో పంట విత్తితే ఫిబ్రవరి, మార్చిలోనే పంట చేతికి వస్తుంది. పంటను భూమి నుండి వెలికితీయటం, ఉడక బెట్టటం, ఆర బెట్టటం తదితర పనులు సుమారు నెల నుంచి 40రోజుల సమయం పడుతుంది. అనంతరం మార్కెట్ తరలిస్తారు. మరి కొంత మంది ధర అనుకూలంగా లేక పోవటంతో ఇండ్లలో నిల్వ ఉంచుతారు. మరి కొంత మంది అప్పులు ముప్పవుతాయని వెంటనే విక్రయాలు చేస్తారు. ప్రస్తుతం రైతులు పంటను భూమి నుంచి వెలికి తీసే పనులు ప్రారంభమయ్యాయి. మూడేళ్లుగా క్వింటాల్‌కు రూ.5 నుంచి రూ.6వేల వరకు మాత్రమే ధర వస్తోందని రైతులు వాపోయారు. ఉగాది తర్వాత వేసే కొత్త తూకాల్లోనూ పాత ధరకే వస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కనీసం రూ.15వేలకు పైగా మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. పసుపు పంటను సాగుచేస్తున్న రైతులకు సంబందిత శాఖ అధికారులు నెలకు ఓ సారి పంటలను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వాలి. కానీ అధికారులు అటుదిశగా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్ననాయి.

ఖర్చు అధికం

ఎకరా పోలంలో పసుపు పంటను సాగుచేయాలన్నా సుమారు రూ.50వేల నుండి రూ.60వేల వరకు ఖర్చు అవుతుంది. దానికి తోడు కలుపు తీయడం ఎరువులు వేయటం మరో రూ.20వేల వరకు ఖర్చు అవుతుంది. కరా పా సుమారు 20నుంచి క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంటుంది. అప్పు పండించిన పంటకు అనుకూలంగా మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

దిగుబడి అధికం

పత్తి, కంది పంటలను పోలిస్తే పసుపు పంట దిగుబడి అధికం. ఎకరా పొలంలో పంటను సాగుచేస్తే నాలుగు పుట్లు (ఎనమిది) క్వింటాళ్ల విత్తనం అవసరం. దానికి తోడు మద్ధతు ధర బాగుండాలి. మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో వ్యవసాయ బోరులు లేకున్నా రైతులు సుమారు 30 ఏళ్లగా వాగుల్లో ప్రవహించే నీటితో పసుపు పంటను అధికంగా సాగు చేస్తారు.

20 ఏళ్లుగా సాగు



ఇరవై ఏళ్లగా పసుపు పంటను సాగు చేస్తున్నా. గతంలో సుమారు రెండు ఎకరాలు సాగు చేసేవాడిని. మూడేళ్లగా మద్దతు ధర రాకపోవడంతో ఎకరాలో సాగు చేస్తున్నా. ధరలు అనుకూలిస్తే ఏడాదిలో లక్షాధికారి కావచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్ధతు ధర కల్పించాలి.

శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నాగులపల్లి

మార్కెట్ ఏర్పాటు చేయాలి



పసుపు పంటను విక్రయించాలంటే సుమారు 40కిలో మీటర్ల దూరంలోని వికారాబాద్ మార్కెట్‌కు వెళ్లాల్సిందే. తాండూరులో మార్కెట్ ఏర్పాటు చేయాలని పదేళ్లుగా కోరుతున్నాం. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం రైతుల గోస పట్టించుకోదు. ప్రస్తుతం మద్దతు ధర లేక పోవడం.. రవాణా ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వం ధర పెంపునకు చర్యలు తీసుకోవాలి.

– రాంరెడ్డి, రైతు, గిర్మాపూర్

ప్రతీ గ్రామానికి భారత్ ఫైబర్ నెట్

- పదిమంది తీసుకుంటే ఉచిత కనెక్షన్
- బీఎస్ఎన్ఎల్ డీజీఎం జితేందర్‌సింగ్


మాట్లాడుతున్న జితేందర్‌సింగ్

మోమిన్‌పేట: ప్రతీ గ్రామానికి భారత్ ఫైబర్ నెట్ కేబుల్ అందుబాటులోఉందని బీఎస్ఎన్ఎల్ డీజీఎం జితేందర్‌సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జితేందర్‌సింగ్ మాట్లాడుతూ భారత్ ఫైబర్ నెట్ కేబుల్ అందుబాటులో ఉన్న గ్రామాల్లో నెట్, ఫోన్‌తో పాటు టీవీ కనెక్షన్లు ప్రారంభిస్తామన్నారు. ఈ గ్రామాలలో ప్రభుత్వం అనుమతులు ఇస్తే 4జీ, 5జీ, 6జీ త్వరలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. నగరాల మాదిరిగానే గ్రామాల్లోనూ సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఏదైనా గ్రామంలో పది మందికి నెట్ అవసరం ఉంటే వారికి ఉచితంగానే కనెక్షన్ అందజేస్తామన్నారు. కేవలం రీచార్జ్ చేసుకోవాలన్నారు. బీఎస్ఎన్ఎల్, బీబీఎన్ఎల్ కలిసి సంయుక్తంగా ఈ సేవలు నిర్వహిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శర్మన్, ట్రాన్స్‌మిషన్ ఏజీఎం ప్రకాశ్, బీఎస్ఎన్ఎల్ టిప్పు రాములు, బీబీఎన్ఎల్ ఫీల్డ్ ఇంజనీర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే 'ధరణి' రద్దు

ఏఐసీసీ కో ఆప్షన్ సభ్యుడు రమేశ్ మహరాజ్


ఇంటింటి ప్రచారంలో రమేష్ మహరాజ్

తాండూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్ రద్దు చేస్తామని ఏఐసీసీ కో ఆప్షన్ సభ్యుడు రమేశ్ మహరాజ్ అన్నారు. తాండూరు మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం 33వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు అన్నివిధాలు మేలు చేకూరిందన్నారు. తొమ్మిదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో పేదలు, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరిట పేదల భూములను లాక్కుంటుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల పంటరుణాలు మాఫీ చేస్తామన్నారు. రూ.500కే వంట గ్యాస్ అందజేస్తామని వివరించారు. రైతుల పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మధుబాల, మాజీ కౌన్సిలర్ రవి కుమార్, పీసీసీ మాజీ డెలిగేట్ సర్దార్ ఖాన్, నాయకులు భీంశకర్, లియాకత్‌అలీ, మహ్మద్ సమద్, జలాల్, కావలి సంతోశ్, హబీబ్‌లాల, షూకుర్, శ్రీనివాస్, వెంకటయ్య, రామలింగం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో మెరిసిన వైష్ణవి

- వాతావరణ శాఖ పోస్టర్ విభాగంలో విద్యార్థినికి తృతీయ బహుమతి
- అభినందించిన పాఠశాల సిబ్బంది


బహుమతి అందుకుంటున్న విద్యార్థిని వైష్ణవి

కేశంపేట: ప్రపంచ వాతావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బేగంపేట వాతావరణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ తయారీపై గురువారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 172మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి ఇంగ్లిష్ మీడియం చదువుతున్న వైష్ణవి, సౌమ్య, కీర్తన, మహాలక్ష్మి పాల్గొన్నారు. వీరిలో వైష్ణవి వాతావరణ పోస్టర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో నిలిచింది. విద్యార్థినికి వాతావరణశాఖ డైరెక్టర్ నాగలక్ష్మి బహుమతిని అందించారు. ఈ పోటీలను సైంటిస్టు శ్రావణి పర్యవేక్షించారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంపై ఇన్‌చార్జి హెచ్‌ఎం, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు శిరీష, సాయిప్రసాద్ రావు, రాజు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదలు తెలిపారు.

గ్రామంలో చిచ్చుపెడితే చెట్టుకు కట్టేస్తాం

వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: గ్రామాల్లో కుల వివక్ష పేరిట చిచ్చుపెడితే చెట్టుకు కట్టేస్తామని వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ ఘాటుగా స్పందించారు. 'పండుగ రోజు ఆలయాలకు తాళం' అనే శీర్షికన 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన వార్తకు ఎమ్మెల్యే స్పందించారు. ఆయన స్వగ్రామంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఎమ్మెల్యే నేరుగా గ్రామానికి వెళ్లి మాట్లాడారు. పచ్చగా ఉన్న గ్రామంలో బయటి వ్యక్తులు కాసులకు కక్కుర్తిపడి కేసులు పెట్టించేందుకు యత్నిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నాలుగేళ్లలో నియోజకవర్గ పరిధిలో ఎక్కడా చిన్న కేసు లేకుండా చూస్తున్నామన్నారు. అన్నదమ్ముల్లా కలిసి ఉండే వారిపై కక్షలు చెలరేగడానికి కారణమైతే ఊరుకునేది లేదన్నారు. కేరెల్లిలో జరిగిన చిన్న సంఘటన అపోహలకు దారితీసిందని.. ఆలయంలో చోరీ జరిగి విలువైన వస్తువులు పోవడంతోనే తాళం వేస్తున్నారని ఆయన వివరించారు. తాళం చెవి ఓ వ్యక్తి దగ్గర భద్రపరిచారని.. ఎవరైన పూజకు వస్తే తాళం తీసుకొని వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. కుల వివక్ష అనేది ఈ గ్రామంలో లేదన్నారు. సర్పంచ్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. నాలుగున్నర ఏళ్లలో దాతల సహకారంతో గ్రామంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టానని ఓ టీవీ ఛానల్ పనిగట్టుకుని అసత్యప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సంతోశ్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, దళిత నాయకుడు ఆనంద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ధర్నా

ఆలయాలకు తాళం వేసిన సంఘటనపై గురువారం దళిత సంఘాలు కేరెల్లిలో ధర్నా చేపట్టాయి. ఈ ఘటనకు కారణమైన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ ధర్నాలో ఆయా సంఘాల నాయకులు ఆర్.మహిపాల్, ఆనంద్, రవి, సుదర్శన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మోమిన్‌పేట: పెద్ద కోల్కుందలో ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

ఎకరాకు రూ.10 వేల పరిహారం

మోమిన్‌పేట: అకాల వర్షం, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని సీఎం కేసీఆర్ ప్రకటించారని ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్ తెలిపారు. గురువారం ఆయన మండల పరిధిలోని చిన్న, పెద్ద కోల్కుంద, అంరాధికలాన్ గ్రామాల్లో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్‌తో కలిసి పరిశీలించారు. నష్టపోయిన ఉల్లి, టమాట, మొక్కజొన్న, జొన్న, తదితర పంటలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన ప్రతీ గుంటకు నష్టాన్ని అంచనా వేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. రెండు రోజుల్లో వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు గ్రామాల వారీగా పర్యటిస్తూ పంట నష్టం అంచనా వేస్తారని చెప్పారు. మండల పరిధిలో అధిక విస్తీర్ణంలో సాగు చేసిన ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రతీ ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరిశంకర్, మండల వ్యవసాయాధికారి జయశంకర్, ఏఈఓ పెంటయ్య, సర్పంచ్ అంజయ్య, నాయకులు భిక్షప తి, నర్సింలు, మల్లేశం, శ్రీనివాస్, లక్ష్మయ్య, రాజు, సందీప్, అంతయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

తాళం తీయించిన తహసీల్దార్


ధారూరు: గాలిపోచమ్మ ఆలయ తాళం తీస్తున్న అధికారులు

మండల పరిధిలోని కేరెల్లి గ్రామంలో గ్రామ దేవతల ఆలయాలకు వేసిన తాళాలను గురువారం తహసీల్దార్ భువనేశ్వర్ తీయించారు. కలెక్టర్ ఆదేశానుసారం ఆయన రెవెన్యూ సిబ్బందితో గ్రామానికి వెళ్లి తాళాలను స్వాధీనం చేసుకుని గ్రామ కార్యదర్శి ఆధీనంలో ఉంచారు. ఉగాది రోజున గుడులకు తాళాలు వేయించినట్లు దళితులు ఆరోపించిన సంఘటనపై ఆయన విచారణ చేశారు. ఇక నుంచి ఆలయాల బాధ్యత వీఆర్‌ఏ లేదా పంచాయతీ కార్యదర్శి తీసుకుంటారని చెప్పారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి


ఆర్‌ఆర్ ఫౌండేషన్ అందజేసిన పరీక్ష ప్యాడ్‌లతో విద్యార్థులు


విద్యార్థులకు స్టేషనరీ అందజేసిన ఎంఐఎం కౌన్సిలర్ బాంబిన

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప

తాండూరు టౌన్: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తూ విజయం సాధించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప అన్నారు. గురువారం ఆమె స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డికి చెందిన ఆర్‌ఆర్ ఫౌండేషన్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఒత్తిడి ఉంటుందని దానిని పక్కకు పెడుతూ.. లక్ష్యంవైపు దూసుకెళ్లాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉన్నత విద్యకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. విదేశీ విద్యకు ఆర్థిక చేయూతనిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, సలీమ్, సమద్ పాల్గొన్నారు.

పట్టుదలతో విజయం సాధించాలి

మున్సిపల్ 14వ వార్డు ఎంఐఎం కౌన్సిలర్ బాంబిన పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (ఉర్దూ మీడియం), ప్రభుత్వ నెంబర్-2(తెలుగు) పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫయాజ్, సోహైల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛంద' సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాదారం జెడ్పీహెచ్‌ఎస్‌లో క్సేబియా మధునాపంతుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన తరగతి గది నిర్మాణం చేపట్టి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉండడంతో నూతన భవన నిర్మాణాన్ని నిర్మించడం సంతోషకరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంతో మౌలిక వసతుల కల్పిస్తోందన్నారు. గ్రామంలో స్వచ్ఛంద సంస్థలు ఉన్న ఎన్‌ఆర్‌ఐల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నెదర్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ క్సేబియా కార్యదర్శి చలపతి, ఆర్యన్, విజయ్ ఆర్యా, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, సర్పంచ్ రాములు పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ పాల్గొన్నారు.


తరగతి గది ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

సీఎంఆర్‌ఎఫ్.. పేదలకు వరం

దోమ: సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి గ్రామానికి చెందిన మనీషా అనే మహిళ అనారోగ్యంతో నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో బాధిత కుటుంబీకులు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1.50లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును గురువారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తన నివాసంలో అందజేశారు.

పోలీసులకు స్వయం భద్రత తప్పనిసరి

డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి


హెల్మెట్లు అందజేస్తున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

బొంరాస్‌పేట: నిత్యం చట్ట భద్రతను కాపాడుతున్న పోలీసులకు స్వయం భద్రత కూడా తప్పనిసరియని డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎస్‌ఐ పి.శంకర్ ఆధ్వర్యంలో స్థానిక మండల పోలీసు సిబ్బందికి ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం ప్రజాభద్రతను కాపాడుతున్న పోలీసులు వ్యక్తిగత భద్రత ప్రధానమన్నారు. గ్రామాలకు అత్యవసర పరిస్థితిలో ద్విచక్రవాహనంపై వెళ్లేప్పుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేని వారికి జరిమానా వేసే పోలీసు సిబ్బంది వాడకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ సీఐ శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి సమావేశం

అనంతగిరి: పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. రంజాన్ నేపథ్యంలో గురువారం సాయంత్రం వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మతసామరస్యంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో సీఐ శీను తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ నూతన కార్యవర్గం చెల్లదు

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖుర్షీద్ హుస్సేన్


మాట్లాడుతున్న ఖుర్షీద్ హుస్సేన్

తాండూరు: ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ తాండూరు కమిటీ పేరిట అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఎస్పీకి ఫిర్యాదు చేశామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఖుర్షీద్ హుస్సేన్, హాదీ శాహెరీ వివరించారు. గురువారం వారు పట్టణంలోని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 14న అసోసియేషన్ చెందిన కొందరు సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. అధ్యక్షుడిగా కమల్ అతార్, ప్రధాన కార్యదర్శిగా ఖలీద్‌సైఫ్ ఉల్లా, మహ్మద్ యూనుస్‌లు ఎన్నికైనట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయని చెప్పారు. ఈ అసోసియేషన్ 1997లో 6607 నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించాయమని వివరించారు. ఇటీవల అసోసియేషన్‌కు చెందిన కొందరు సభ్యులు కొత్త కమిటీ ఏర్పాటు చేసి అక్రమంగా రూ.500 చొప్పున చందాలు వసూలు చేస్తున్నారన్నారు. తాము దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నా ఇప్పటి వరకు చందాలు వసూలు చేయలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఈ కమిటీ నియామకం చెల్లదన్నారు. ఇప్పటికీ ప్రధాన కమిటీ కొనసాగుతోందన్నారు. గతంలో అసోసియేషన్‌కు శాశ్వత ఆదాయం వచ్చేలా దుకాణ సముదాయాన్ని నిర్మించామని అందుకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు సహకరించారన్నారు. అక్రమంగా కమిటీ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వారిపై ఇప్పటికే ఎస్పీకు ఫిర్యాదు చేశామని.. తాండూరు డీఎస్పీ, పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.